## క్లుప్తంగా

### పౌష్టికాహారం పంపిణీ



బాధితులకు పౌష్టికాహారం అందిస్తున్న మానవత సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కష్టాల్లో ఉన్న వారికి దాతలు అందించే సహకారం మరువలేనిదని మానవతా జిల్లా ఆత్మీయ కమిటీ డైరెక్టర్ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్తపేట ఆర్ఫన్ హెల్త్ కేర్ సెంటర్‌లో హెచ్ఐవీ బాధితులకు, వారి పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా దాతల సహకారంతో హెచ్ఐవీ బాదితులకు ప్రతి నెలా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. దాత డి.నాగ మల్లేశ్వరరావు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా దాతను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ మండల అధ్యక్షుడు మద్దాల వాసు, ముత్యాల రామారావు, రావాడ సతీష్, బొక్కా రమాకాంత్, ముత్యాల చైతన్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

### కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



నడిపూడి కార్యదర్శికి వినతి పత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుగొండ: పంచాయతీల్లో పని చేసే కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం నడిపూడి పంచాయతీ కార్యదర్శికి వేతనాలు సకాలంలో చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు కార్మికులకు వేతనాలు చెల్లించడానికి ఒకరిపై ఒకరు ఆరోపిస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఇద్దరు సమన్వయంతో పని చేసి వేతనాలు సత్వరం చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో పోరాట చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

### పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇంటింటి ప్రచారం చేస్తున్న దృశ్యం

భీమవరం: కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మాజీ కౌన్సిలర్లు ఎంఏ నౌషాద్, మాగాపు ప్రసాద్ కోరారు. సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ మోడల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ హెచ్ఎం షేక్ బాబాజీ సాహెబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మోడల్ స్కూళ్లలో కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంతోపాటు ఉచితంగా పుస్తకాలు, బ్యాగ్, దుస్తులు వంటివి అందిస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అహ్మద్ ఆలీషా, మహమ్మద్ కాజా, యర్రంశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రంగమ నాయుడు

పాలకోడేరు: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పాలకోడేరు మండల ప్రాథమిక వైద్యాధికారి సీహెచ్ రంగం నాయుడు అన్నారు. ప్రతి నెలా 9న నిర్వహించే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సుమారు 50 మంది గర్భిణులకు రక్త పరీక్షలు చేయించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు అత్యధిక పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు ముఖ్యంగా ఆకుకూరలు, పీచు, ఐరన్ శాతం ఎక్కువగా ఉండే కాయగూరలు, పండ్లు తీసుకోవడమే కాకుండా శరీరానికి తగిన వ్యాయామం కూడా చేస్తే సాధారణ ప్రసవం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా యునైజేషన్ అధికారి డాక్టర్ డి.సుధాలక్ష్మి, డీపీహెచ్ఎన్ఓ జి.వెంకటరత్నం, వైద్యాధికారి డాక్టర్ స్వర్ణ నిరంజని, పీహెచ్ఎన్ కుమారి, సీహెచ్ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రక్తహీనత.. ప్రాణాంతకం

- గ్రామాల్లో సికిల్ సెల్ వ్యాధిపై సర్వే
- వ్యాధిపై అవగాహన తప్పనిసరి
- 19న ప్రపంచ సికిల్ సెల్ అవేర్‌నెస్ డే



దగ్గులూరులో సికిల్ సెల్ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నవ్య జీవన్, వైద్య సిబ్బంది(ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ ఏ అనారోగ్య సమస్యకైనా దాదాపుగా రక్తహీనతే కారణమవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. రక్త హీనతను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమవుతుందని వైద్యులు తెలిపారు. మన కళ్ల ముందు చిన్నారులు ఆడుతూ పాడుతూ చలాకీగా తిరుగుతూ ఒక్కసారిగా నీరసపడిపోయారంటే ఆ తల్లి తల్లడిల్లిపోతుంది. దీనికి ప్రధాన కారణం చిన్నారుల్లో సాధారణంగా కనిపించే రక్తహీనతే. ఇది సమస్యగా మారి సికిల్ సెల్ వ్యాధికి కారణమవుతుంది. ఈ వ్యాధి మన్యం ప్రాంతాల్లో వంశ పారంపర్యంగా కూడా సోకుతుంటుంది. జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు తరలి వచ్చి జీవనం సాగించే రక్తహీనత ఉన్నవారికి ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంటుంది. ఈ సికిల్ సెల్ వ్యాధి తీవ్రతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వ్యాధికి కారణమైన రక్తహీనత సమస్య పరిష్కారానికి అధికంగా ప్రచారం చేయిస్తుంది. సికిల్ సెల్ ఎనీమియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

**వ్యాధి నిర్మూలన రక్తహీనత నివారణతోనే సాధ్యం**

సికిల్ వ్యాధి నిర్మూలన రక్తహీనత నివారణతోనే సాధ్యమవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. దీనిపై ప్రపంచ ఆరోగ్య కేంద్రాల ఆదేశాల మేరకు పాఠశాల దశ నుంచే రక్తహీనత నివారణకు వైద్య ఆరోగ్య శాఖ దేశ వ్యాప్తంగా ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని చేపడుతుంది. ఈ సమస్య పరిష్కారానికి పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆరోగ్య వివరాలు సేకరించడం వారికి తగిన చికిత్స అందించడం చాలా ముఖ్యమని గుర్తించారు. ఈ వ్యాధి నివారణకు పీహెచ్‌సీల స్థాయిలో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో మూడు మండలాల్లో ఉన్న 4 పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రి పరిధిలో రక్తహీనతపై ప్రత్యేక అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

**సికిల్ సెల్ వ్యాప్తికి కారణాలు**

జన్యు పరమైన ఎర్ర రక్త కణాల రుగ్మతను సికిల్ సెల్ ఎనీమియా అంటారు. శరీర కణ జాలానికి ప్రాణ వాయువును అందించే గుండ్రని ఆకారం కలిగిన ఎర్ర రక్త కణాలు సికిల్ (కొడవలి) ఆకారంలోకి మారడంతో రక్త నాళాలు మూసుకుపోయి ప్రమాదం సంభవిస్తుంది. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న వారిని వ్యాధి ఆశిస్తుంది. వ్యాధి సోకిన వారిలో ఒక జన్యువు కొడవలి ఆకారంలో మరొకటి సాధారణ ఆకారంలో ఉన్నట్లయితే వారిని సికిల్ సెల్ క్యారియర్లు అంటారు. అలాంటి వ్యక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్య ఉండదు. అదే వ్యాధి సోకిన వారికి మాత్రం రెండు జన్యువులు కొడవలి ఆకారంలో ఉన్నట్‌లైతే సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. చిన్నారుల్లో పుట్టిన ఐదారు నెలల వరకూ వ్యాధి లక్షణాలు బయట పడే ఆవకాశం ఉండదు. సాధారణంగా రక్త కణాలు 120 రోజుల వరకూ జీవించి ఉంటాయి. అదే సికిల్ వ్యాధి భారిన పడిన చిన్నారుల్లో 20 నుంచి 25 రోజులు మాత్రమే ఉంటాయి. రక్త కణం ఆకారం కొడవలి ఆకారంలో ఉండడంతో రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించక పోవడం, సరైన మందులు అందకపోవడంతో ఆక్సిజన్ అందక 15 ఏళ్ల లోపు చనిపోయే ప్రమాదం ఉంటుంది.

**వ్యాధి నియంత్రణకు కృషి**

సాధారణంగా గిరిజన ప్రాంతాల్లో ఈ సికిల్ సెల్ వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుంది. గిరిజన జనాభాలో ప్రతి 86 మందిలో ఒకరికి ఈ వ్యాధి సోకుతున్నట్లు గుర్తించారు. వివాహం చేసే ముందు ఇద్దరికీ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని నియంత్రించేందుకు వీలుంటుంది. జన్యువు కలిగి ఉన్న క్యారియర్ల మధ్య వివాహాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

**కేంద్ర ప్రభుత్వ కార్యాచరణ**

2047 నాటికి దేశంలో సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేస్తుంది. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం, నిర్ధారణకు పరీక్షలు నిర్వహించడం, వ్యాధి సోకిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 19న సికిల్ సెల్ అవేర్‌నెస్ డేను పాటించాలని కేంద్రం ప్రభుత్వం సమాయత్తం అవుతుంది.

**సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు**

రక్త కణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత వస్తుంది. కళ్లు పసుపు రంగులోకి మారతాయి, తీవ్రమైన ఒళ్లు, కీళ్ల నొప్పులు వస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురవుతుంది. అలసట వస్తుంది. అంటు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుంది. ఒక్కోసారి శరీర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. వీపు, కాళ్లు, ఛాతి భాగాల్లో విపరీతమైన నొప్పి వస్తుంటుంది. విరేచనాలు, జ్వరం, డీహైడ్రేషన్, ఒత్తిడి, అలసట వంటి లక్షణాలు నొప్పులను మరింత తీవ్రం చేస్తాయి.

### “ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం



ట్రైబల్ ఏరియాల నుంచి పనులపై ఇక్కడకు వచ్చే కార్మికులకు జన్యుపరంగా ఎర్ర రక్తకణాల్లో డిఫెక్ట్ ఉండడం వలన ఎక్కువగా ఈ సికిల్ సెల్ వ్యాధి సోకే ప్రమాదం ఉంటుంది. మన ఏరియాలో మండలంలో దగ్గులూరు ప్రాంతంలో పరీక్షలు నిర్వహించాం. ఇప్పటి వరకూ సుమారు 159 మందికి పరీక్షలు నిర్వహించాం. ప్రస్తుతం అందరికీ నెగిటివ్ రిపోర్ట్ వచ్చింది. పరీక్షలు నిర్ధారించిన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం.

–డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్, పీహెచ్‌సీ లంకలకోడేరు

### నియోజకవర్గ అభివృద్ధికి కృషి

పెనుగొండ: నర్సాపురం నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధికి నిధులు మంజూరు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజ వేయించాలని పెనుగొండ మండల బీజేపీ అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూరు అన్నారు. సోమవారం కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఏడాది కాలంగా ఎంతో అభివృద్ధి చేశారన్నారు. రోడ్లు, డయాలసిస్ సెంటర్లు, విశాఖ ఉక్కుకు ప్యాకేజీ తీసుకురావడంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేయాలని కోరినట్లు తెలిపారు.

### లెప్రసీ రోగులకు మందులు, బియ్యం పంపిణీ



లెప్రసీ రోగులకు పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ, డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బీవీ రాజు వర్థంతి సందర్భంగా సోమవారం భీమవరం పరిసర ప్రాంతాల్లో వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా బీవీ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పరిసర ప్రాంతాల్లోని లెప్రసీ సెంటర్లలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని సెంట్‌మేరీస్ లెప్రసీ సెంటర్‌లో లెప్రసీ, ఎయిడ్స్, టీబీ రోగులకు సుమారు రూ.50 వేల విలువ కలిగిన మందులు, బియ్యం అందజేశారు. 7వ వార్డులోని లెప్రసీ సెంటర్‌లో రోగులకు బియ్యం, పండ్లు, నెలవారీ పింఛన్లు అందించారు.

### ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

తణుకు అర్బన్: వ్యాధులకు భయపడడం కంటే ముందస్తు జాగ్రత్తలు పాటించడం సరైన విధానమని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని సజ్జాపురం మల్లికాసుల ఏరియాలో సోమవారం జాతీయ మలేరియా మాసోత్సవం – జూన్ 2025 కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించడం, ఇంటి పరిసరాల్లో అనసరం లేని నీటి నిల్వలు లేకుండా చేసుకునే డ్రైడే పాటించడం, ఇంటి లోనికి దోమలు చొరబడకుండా కిటికీలకు మెష్ ఏర్పాటు చేసుకోవడం నివారణ మార్గాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీలు పాల్గొన్నారు

## ఇళ్లు తొలగించకుండా రెగ్యులైజ్ చేయాలి



ఆర్డీవో దాసి రాజుకు సమస్య వివరిస్తున్న సరిపల్లి వాసులు

నరసాపురం: 30 ఏళ్లుగా పంచాయతీకి ఇంటి పన్నులు చెల్లిస్తూ నివాసం ఉంటున్న తమ ఇళ్లను తొలగించకుండా రెగ్యులైజ్ చేసి పట్టాలు ఇప్పించాలని నరసాపురం మండలం సరిపల్లి గ్రామం ఏరువు ప్రాంత వాసులు కోరుతున్నారు. సోమవారం గమిడి మధుబాబు ఆధ్వర్యంలో నరసాపురం ఆర్డీవో దాసి రాజును కలిసి వినతి పత్రం ఇచ్చారు. బండి పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న తమ ఇళ్లను జీవో నంబర్ 30, 2025 ప్రకారం రెగ్యులైజ్ చేయాలన్నారు. కానీ ఇటీవల ఇళ్లు తొలగించాలని పంచాయతీ తీర్మానం చేసినట్టుగా తెలిసి ఆందోళన చెందుతున్నామని వాపోయారు. తాము నివసిస్తున్న బండి పోరంబోకు స్థలానికి అక్కడున్న ప్రభుత్వ చెరువుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాము ఇళ్ల స్థలాలు కూడా తీసుకోలేదని వివరించారు. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న తమకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జల్లి శాంతకుమారి, జల్లి లక్ష్మీకాంతం, మోకా రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## బకాయి వేతనాలు చెల్లించాలి



వడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

పెనుగొండ: రెండు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వడలిలో ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని పరిశీలించి, ఉపాధి కూలీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు చెల్లించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రెక్కాడితే గాని, డొక్కాడని వ్యవసాయ కూలీలు ఉపాధి పనులను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటే వేతనాలను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలు మండుతుండడంతో కార్మికులకు తాత్కాలిక నీడను, తాగునీటి సౌకర్యం కల్పించడంలోనూ, ఉపాధి కూలీలకు పనులు చూపడంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నౌడు రమణ, పార్వతి, సర్వేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నరసాపురం: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో దాసి రాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంలో అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరిస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం ఎందరో రైతులు భూములిచ్చారని, ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కారు చౌకగా ధారాదత్తం చేయాలని చూడటం దారుణమన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో విధుల నుంచి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎడ్ల చిట్టిబాబు, పున్నాని అప్పలనాయుడు, పొన్నాడ మల్లేష్, పైల సత్తిబాబు, కిలారి రాజు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పెనుగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

నరసాపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పట్టణంలో యోగా అవహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి శివాలయం సెంటర్ వరకూ ర్యాలీ సాగించి, యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ యోగా మనకు పూర్వీకులు ఇచ్చిన వరమన్నారు. యోగా ప్రత్యేకతను ప్రపంచ దేశాలు గుర్తించాయని చెప్పారు. జూన్ 21వ తేదీని అంర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో యోగా గురువు వీఎస్‌పీకే శాస్త్రి, మెడికల్ ఆఫీసర్ ఎన్ గంగారావు, వార్డు సచివాలయాల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

**యోగా నిత్యకృత్యం కావాలి**

పెనుగొండ: ప్రతి ఒక్కరి జీవితంలో యోగా నిత్యకృత్యం కావాలని ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 నిర్వహించనున్న దినోత్సవం విజయవంతం చేయాలని కోరుతూ పెనుగొండలో ర్యాలీ నిర్వహించారు.

**ప్రతి ఒక్కరూ యోగా చేయాలి**

యలమంచిలి: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలని మేడపాడు గ్రామ కార్యదర్శి రామారావు కోరారు. సోమవారం మేడపాడు గ్రామంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైస్కూల్‌లో అందరూ కొంత సమయం యోగ సాధన చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మనిషికి శారీరిక శ్రమ తగ్గుతున్న ప్రస్తుత రోజుల్లో జీవిత చరమాంకంలో కూడా ఆరోగ్యంగా ఉండాలంటే యోగ సాధన ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నరసాపురం: యోగపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది,



యలమంచిలి: మేడపాడులో యోగ సాధన చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

## ‘తల్లికి వందనం’ పేరుతో సున్నం రాశారు



బాధితులను పరామర్శిస్తున్న ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలో పోడూరు మండలంలో పలు గ్రామాల్లో పర్యటించిన వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పలువురిని పరామర్శించారు. సోమవారం పోడూరు మండలంలో రావిపాడు, పెనుమదం గ్రామాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలు నవరత్నాల పథకాల ద్వారా ఎంతో లబ్ధి పొందారన్నారు. నేడు ఇచ్చిన ఏ హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టి పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. త్వరలో పాఠశాలలు తెరవనున్నారు. ఇంత వరకూ తల్లికి వందనం పథకం అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక సంవత్సరం గడిచిపోయిందని అంటే ఒక సంవత్సరం తల్లికి వందనం పేరుతో సున్నం రాశారన్నారు. రావిపాడులో వాసా నాగన్న, కరెంట్ షాక్‌కు గురైన వరదా సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పెనుమదంలో ప్రమాదానికి గురైన గెద్దాడ ఏసు, బాత్రూంలో కాలు జారి పడిన రావిపాడుకు చెందిన కడలి రాంబాబులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వీరాస్వామి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత, జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమా మహేశ్వరరావు, వీరా మల్లిఖార్జునుడు, జల్లి మురళీకృష్ణ, వాసా జయ చంద్రశేఖర్, దేవ రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు, రామానుజుల చినమదులు పాల్గొన్నారు.

## నిర్జీవంగా ఉండి సెంటర్!



నిర్మానుష్యంగా మారిన ఉండి సెంటర్



మండుటెండలో ఓ దుకాణం నీడలో ప్రయాణికులు

ఉండి: ఎప్పుడు దుకాణాలు, ప్రజలతో నిత్యం రద్దీగా కళకళలాడే ఉండి సెంటర్ ఇప్పుడు నిర్జీవంగా మారిపోయింది. అధికారులు, కూటమి నాయకులు చిరువ్యాపారులపై ఉక్కుపాదం మోపడంతో వారంతా నడిరోడ్డున పడ్డారు. ఆక్రమణల పేరుతో రోడ్లపై చిరు వ్యాపారులను ఖాళీ చేయించి వారి జీవితాలతో ఆడుకున్నారు. గతంలో ఓసారి ఉండి సెంటర్‌లో కొంతమేర, గణపవరం రోడ్డులో అనుకున్నంతగా తొలగించిన అధికారులు ఇప్పుడు మాత్రం పూర్తిగా ఉండి సెంటర్ రూపురేఖలు మార్చేశారు. ఏళ్ల తరబడి ఉంటున్న వారికి ప్రత్యామ్నాయం చూపించి ఆక్రమణలు తొలగిస్తే బాగుండేదని, ఇప్పుడు మా పరిస్థితి ఏంటని వారు వాపోతున్నారు. అంతేగాకుండా ఉండి బస్టాండ్‌లో మౌలిక వసతులు సరిగా లేకపోవడంతో జంక్షన్ అయిన ఉండి సెంటర్‌లో ఆటోలు, బస్సుల్లోను ప్రయాణించేందుకు పదుల సంఖ్యలో ప్రయాణికులు ఎదురు చూస్తుంటారు.

### నిధులు విడుదల కాగానే పూడికతీత పనులు

పెనుమంట్ర: ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే గోస్తనీ డ్రెయిన్ తవ్వకం, జుత్తుగ వేల్పూర్ రోడ్ నిర్మాణ పనులు చేపడతామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చెప్పారు. సోమవారం ఉదయం ఎస్.ఇల్లిందలపర్రు, మల్లిపూడి గ్రామాల్లో పల్లెపల్లెకు పితాని కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో పెనుమంట్ర తహసీల్దార్ వైవీ రవికుమార్, ఎంపీడీవో జీఎస్ ప్రభాకర్‌రావు, మల్లిపూడి సర్పంచ్ దొంగ మహాలక్ష్మి, ఎంపీటీసీ దండు లక్ష్మి, వెలగల బుల్లి రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం



పెదఅమీరంలో మైక్రో వాటర్ ప్లాంట్ ప్రారంభించి నీరు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్, కలెక్టర్

కాళ్ల: నియోజకవర్గంలోని ప్రజలకు స్వచ్ఛమైన సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరంలో రూ.15లక్షల నిధులతో నిర్మించిన 10 లక్షల లీటర్ల కెపాసిటీ గల మైక్రోఫిల్టర్‌ను కలెక్టర్ సి.నాగరాణి, కెనరా బ్యాంక్ ఎండీ కలిదిండి సత్యనారాయణరాజుతో కలిసి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స శిరీష పాల్గొన్నారు.